క్లుప్తంగా

పుస్తకాల అందజేత



ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్‌లోని కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయ (కేజీబీవీ)లో చదువుతున్న విద్యార్థులకు నేషన్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ శంకర్ కెరీర్ గైడెన్స్, ప్రేరణ సదస్సు, పాలిటెక్నిక్, లైబ్రరీ పుస్తకాలు సోమవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఫౌండేషన ఆధ్వర్యంలో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలు అందజేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు ఎన్ని ఆటంకాలు ఎదురైనా గమ్యాన్ని చేరుకునేలా కష్టపడాలని సూచించారు. పోటీ ప్రపంచానికి దీటుగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో విద్యాలయ స్పెషల్ ఆఫీసర్ (ఎస్‌ఓ) మేనక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్ష ప్యాడ్లు, పెన్నులు..

నల్లబెల్లి : మండలంలోని రంగాపురం హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు దళిత విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో సమకూర్చిన ప్యాడ్లు, పెన్నులను ఎస్సై గోవర్ధన్ అందజేసి మాట్లాడారు. విద్యార్థులు ప్రణాళికాయుతంగా చదువుకుని మెరుగైన ఫలితాలు సాధించాలని చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తూముల రఘువీర్, పంచాయతీ కార్యదర్శి రామారావు, వీహెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు పులి రమేష్, ఉపాధ్యాయులు రామకృష్ణ, సూరి, తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండలంలోని మొండ్రాయి హైస్కూల్ విద్యార్థులకు హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ చైర్మన్ బుగ్గారపు రామకృష్ణ పరీక్ష ప్యాడ్‌లు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ప్రకాశ్, స్టాఫ్ సెక్రటరీ మనోహర్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ప్లేట్లు..

చెన్నారావుపేట : మండల కేంద్రానికి చెందిన గాదెగోని రాజు అతని తండ్రి సదయ్య జ్ఞాపకార్థం స్థానిక, పాపయ్యపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్లేట్లు అందజేశారు. అలాగే ఆఫీస్ సబార్డినేట్ భూక్యా క్రాంతికుమార్ అతని తండ్రి హరిపతి జ్ఞాపకార్థం వాటర్ బాటిల్స్ అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు పాపమ్మ, పత్తి నర్సింహారెడ్డి, కిశోర్, బండారి భిక్షపతి, శ్రీనివాస్, రవి, రజని, ఉమాదేవి, కౌసర్, శ్రీలత, రాజశేఖర్, నర్సింహస్వామి, కుమారస్వామి, మధుబాబు, శాంత మేరీ, తస్నిమ్, తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు పంపిణీ

వర్ధన్నపేట : మండలంలోని కుమ్మరిగూడెంకు చెందిన బీఆర్‌ఎస్ క్రియాశీలక సభ్యుడు భూక్యా బీల్యా(57) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా బాధిత కుటుంబానికి పార్టీ తరఫున మంజూరైన రూ.2 లక్షల బీమా చెక్కును ఆ పార్టీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎర్రబెల్లి దయాకర్‌రావు సోమవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. పార్టీ శ్రేణులను ఆదుకునేలా బీమా పథకాన్ని వర్తింపజేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, మాజీ ఎంపీపీ అన్నమనేని అప్పారావు, మాజీ జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, పట్టణ అధ్యక్షుడు గోధుమల మధుసూదన్, నాయకులు ఎలేందర్‌రెడ్డి, గుజ్జ సంపత్‌రెడ్డి, రహీమ్, కంజర్ల రవి, మహేశ్, సిలువేరు కుమారస్వామి, కొండేటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సోషల్ ఆడిట్

నల్లబెల్లి : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 2023–24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులకు సంబంధించి నేడు (మంగళవారం)సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నర్సింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఇన్‌హౌజ్ సమావేశంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఉపాధి సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాలని కోరారు.

కేసీఆర్ జన్మదిన వేడుకలు



వర్ధన్నపేట : కేక్ కట్ చేస్తున్న దయాకర్‌రావు

సాక్షి నెట్‌వర్క్ : జిల్లాలోని వర్ధన్నపేట, నర్సంపేట, పర్వతగిరి, నల్లబెల్లి, చెన్నారావుపేట, ఖానాపురం, నెక్కొండ, సంగెం, రాయపర్తి, దుగ్గొండి మండలాల్లో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఆ పార్టీ శ్రేణులు కేక్‌లు కట్ చేశారు. స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఇల్లందలోని రాజరాజేశ్వరస్వామి ఆలయంలో మాజీ మంత్రి దయాకర్‌రావు పూజలు చేశారు. మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ శ్రేణులు రక్తదానం చేసి మొక్కలు నాటారు.

నివాళి

నర్సంపేట : బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాణిరుద్రమ, జిల్లా ప్రధాన కార్యదర్శి రాణా ప్రతాప్‌రెడ్డి తల్లి, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు రాయిడి రవీందర్‌రెడ్డి సోదరి జయశ్రీ అంత్యక్రియలు సోమవారం నిర్వహించగా ఆమె మృతదేహానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ స్వప్న వేర్వేరుగా నివాళులర్పించారు. అంత్యక్రియలకు బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు డ్యాగల శ్రీనివాస్, తదితరులు హాజరయ్యారు.

బీసీ కాలనీలో తాగునీటి గోస

- పని చేయని నీటి పథకాలు
- సరఫరా కాని మిషన్ భగీరథ నీరు



ఖాళీ బిందెలు, బకెట్లతో నిరసన తెలుపుతున్న కాలనీవాసులు

నల్లబెల్లి : మండలంలోని అర్శనపల్లి శివారులోని బొల్లోనిపల్లి బీసీ కాలనీలో రెండు నెలలుగా తాగునీటి సమస్య నెలకొంది. వేసవి ప్రారంభానికి ముందే ప్రజలకు తాగునీటి తిప్పలు తప్పడం లేదు. ప్రతి ఇంటికీ మిషన్ భగీరథ తాగునీటిని సరఫరా చేస్తామన్న అధికారులు ప్రకటనలు ఆచరణలో సాధ్యం కావడం లేదని స్పష్టమవుతోంది. కాలనీకి మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతున్నా అధికారులు అరకొరగా అందిస్తుండడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు ఏర్పాటు చేసిన బోరు మరమ్మతుకు గురి కావడం, నిధుల లేమితో అధికారులు పట్టించుకోకపోవడంతో గ్రామానికి దూరంగా ఉన్న బోరుబావి నుంచి కలుషిత నీటిని తెచ్చుకుని తాగడానికి వినియోగిస్తున్న దుస్థితి నెలకొంది. తాగునీటి సమస్య పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాలనీవాసులు ఖాళీ బిందెలతో సోమవారం నిరసన తెలిపారు.

ఇబ్బందులు తప్పడం లేదు

కాలనీలో 30 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. సుమారు 140 మంది జనాభా. మిషన్ భగీరథ నీరు సరిపడా రావడం లేదు. అధికారులు బోరు ఏర్పాటు చేసినా నిధుల కొరత కారణంగా పైపులైన్ ఏర్పాటు చేయలేదని కాలనీవాసులు తెలిపారు. సుమారు 500 మీటర్ల పొడవున్న పైపులు ఏర్పాటు చేసుకొని తాగునీటి అవసరాలను తీర్చుకుంటున్నామని వాపోయారు. రెండు నెలల క్రితం బోరు మరమ్మతుకు గురికావడంతో తాగునీటి సమస్య ఏర్పడిందని చెప్పారు. బోరు మరమ్మతు పనులు పూర్తి చేసి తాగునీటిని అందించాలని కోరితే గ్రామ పంచాయతీకి నిధుల కొరత ఉందంటూ అధికారులు దాటవేస్తున్నారని వాపోయారు. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల అధికారులు స్పందించి నీటి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



ఈ ఫోటోలో కనిపిస్తున్న మహిళ మండలంలోని బొల్లోనిపల్లి బీసీ కాలనీకి చెందిన చెంచులక్ష్మి. వ్యవసాయ పనులకు వెళ్లి ఇంటికి చేరుకున్న ఆమె కాళ్లు, చేతులు కడుక్కోకుండానే ఉండిపోయింది. అర కిలోమీటరు దూరం వెళ్లి నీరు తెచ్చుకునే బదులు వ్యవసాయ బావి వద్దకు వెళ్లినప్పుడు కాళ్లు, చేతులు కడుక్కుంటానని దిగాలుగా చెప్పింది. ఈ సమస్య ఈమెది మాత్రమే కాదు. కాలనీవాసులందరి పరిస్థితి ఇలాగే ఉంది.

రెండు నెలలుగా నీళ్లు రావడం లేదు



రెండు కాలనీకి మిషన్ భగీరథ నీళ్లు రావడం లేదు. అధికారులు బోరు వేసి పైపులైన్ పనులు విస్మరించారు. మేమే పైపులు వేయించుకున్నాం. బోరు పని చేయడం లేదని చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదు. అర కిలో మీటరు దూరం వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నాం.

– రెడ్డి వరలక్ష్మి, బీసీ కాలనీ, బొల్లోనిపల్లి

సమస్య తలెత్తకుండా చూస్తాం



బీసీ కాలనీని సందర్శించి తాగునీటి సరఫరాను పర్యవేక్షిస్తాం. సమస్యను గుర్తించి త్వరితగతిన పరిష్కారించే దిశగా చొరవ తీసుకుంటాం. గ్రామాల్లో నీటి సమస్య ఉంటే ప్రజలు, పంచాయతీ సిబ్బంది అధికారుల దృష్టికి తీసుకెళ్తే సత్వరమే పరిష్కారం అవుతుంది.

– రవి, ఎంపీఓ, నల్లబెల్లి

ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం

- ఇన్‌చార్జ్ తహసీల్దార్ విచారణ



ఆక్రమణకు గురవుతున్న స్థలాన్ని పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజారేణుక, సిబ్బంది

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్‌లోని రైతు వేదిక వెనకాల సర్వే నంబర్ 226లో 30 గుంటల ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నం జరుగుతోంది. గుర్తు తెలియని వ్యక్తులు రెండు నెలలుగా భూఆక్రమణ పనుల్లో ఉన్నారు. డీఫ్లోరైడ్ ప్రాజెక్ట్ నుంచి ఎక్కువైన నీరు వెళ్లేందుకు ఏర్పాటు చేసిన కాల్వను సైతం పూడ్చి వేసి చదును చేశారు. పంపకాలకు సైతం ఏర్పాట్లు చేసుకున్నారు. రెండ్రోజుల క్రితం సదరు భూమిలో ఇళ్ల నిర్మాణాల కోసం ముగ్గు సైతం పోశారు. ఈ క్రమంలో సమాచారం అందుకున్న ఇన్‌చార్జ్ తహసీల్దార్ రాజారేణుక ఆర్‌ఐ స్వామి, సిబ్బంది ఐలేష్‌తో కలిసి సదరు భూమిని సోమవారం సందర్శించి విచారణ చేపట్టారు. సమీపంలోని కాలనీవాసులతో మాట్లాడారు. బఫర్ జోన్‌లోని ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. కేసులు నమోదు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. సదరు స్థలం వద్ద ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేయిస్తామన్నారు.

గ్రంథాలయం ప్రారంభం

నెక్కొండ : జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని బొల్లికొండలో ఏర్పాటు చేసిన కాళోజీ గ్రంథాలయాన్ని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త అనంతలక్ష్మి, ఫౌండేషన్ కన్వీనర్ కవిత లక్ష్మీనారాయణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అనంతలక్ష్మి మాట్లాడారు. గ్రంథాలయాలను విజ్ఞాన భాండాగారాలుగా అభివర్ణించారు. గ్రంథాలయాల ఏర్పాటుతో విద్యార్థులు, ప్రజలు సెల్‌ఫోన్లకు దూరమై ఆరోగ్యకరమైన జీవనాన్ని సాగిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. సమాజంలోని ప్రతిఒక్కరూ గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు సాంబయ్య, అశోక్, సామాజిక కార్యకర్త రమేశ్, రాములు, సంతోశ్, గోపి, యాకూబ్, సురేశ్, పవన్‌కల్యాణ్, రాంచంద్రు, తదితరులు పాల్గొన్నారు.

'వెలుగుల బడి'..



పర్వతగిరి : మండలంలోని ఏనుగల్‌లో జేడీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వెలుగుల బడి కార్యక్రమాన్ని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త అనంతలక్ష్మి, ఫౌండేషన్ కన్వీనర్ కవిత ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో అనంతలక్ష్మి, కవిత మాట్లాడారు. విద్యార్థులు చదువులపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్యూటర్ గూడ పద్మ, ఫౌండేషన్ టీం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ వ్యవస్థ బలోపేతమే లక్ష్యం

- 'సర్వోదయ' కార్యదర్శి దామోదర్



సమావేశంలో మాట్లాడుతున్న దామోదర్

గీసుకొండ : కుటుంబ వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యంగా సర్వోదయ స్వచ్ఛంద సంస్థ కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఆ సంస్థ కార్యదర్శి వల్లెపాడు దామోదర్ తెలిపారు. ఐసీడీఎస్‌తో కలిసి సంస్థ ఆధ్వర్యంలో మండలంలోని గంగదేవిపల్లిలోని శిక్షణ కేంద్రంలో అంగన్‌వాడీ టీచర్లకు ×లింగ ఆధారిత హింస నివారణ–మహిళల రక్షణ చట్టాలు₹ అంశంపై సోమవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా లింగ వివక్షకు గురవుతున్నారని ఆందోళన వెలిబుచ్చారు. మహిళలు, బాలికలు అనేక ఆచార, కట్టుబాట్లతో హింసకు గురవుతున్నారని తెలిపారు. సుమారు 15 ఏళ్లుగా సంస్థ ఆధ్వర్యంలో బాధిత బాలికలకు, మహిళలకు సహాయక కేంద్రాల ద్వారా కౌన్సిలింగ్ చేయడంతోపాటు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలు ఆర్థికంగా ఎదిగే దిశగా టైలరింగ్, తదితర అంశాల్లో ఉచితంగా వృత్తి నైపుణ్య శిక్షణ ఇప్పిస్తున్నట్లు చెప్పారు. సమస్యల్లో ఉన్న మహిళలు, బాలికలు డయల్ 100, 181లను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో సమన్వయకర్త రవికుమార్, సీడీపీఓ డెబోరా, సర్వోదయ సంస్థ సభ్యులు కవిరాజ్, ఇందిర, రవీందర్, అక్తర్, వనిత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సువర్ణ, తదితరులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం



నర్సంపేట : పట్టణంలోని అంబేడ్కర్ సెంటర్‌లో డీబీడీపీఎస్ ప్రజాదండోరా జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు అందె రవి ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చిత్రపటానికి సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రవి మాట్లాడారు. పట్టణంలోని సర్వే నంబర్ 813లోని ప్రభుత్వ భూమిలో డీబీడీపీఎస్ ప్రజాదండోరా, ఎంఎస్‌పీ సంయుక్తం నాయకత్వంలో పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు నాలుగేళ్లుగా గుడిసెలు వేసుకొని అంబేడ్కర్ కాలనీలో జీవిస్తున్న క్రమంలో వసతుల కల్పించడంతోపాటు సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేను కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని చెప్పారు. కాలనీకి విద్యుత్, రోడ్లు, ఇతర సదుపాయాలు కల్పిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారని తెలిపారు. కార్యక్రమంలో డీబీడీపీఎస్ ప్రజాదండోరా ప్రతినిధి కుమ్మరికుంట్ల శ్రీకాంత్, నాయకులు సాలేటి సంధ్య, కందిక జయ, బండి వెంకన్న, రజాక్, సత్యనారాయణ చారి, వేణు, మల్లయ్య, ఉప్పలయ్య, రాములు, రుచిత, కవిత, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నర్సంపేట రూరల్ : రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన నర్సంపేటలో సోమవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. ఖానాపురం మండలంలోని అశోక్‌నగర్‌కు చెందిన కాసుల వెంకటేశ్ (30) ద్విచక్ర వాహనంపై వస్తుండగా నర్సంపేటలోని భారత్ గ్యాస్ ఆఫీస్ సమీపంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్ గుంత రావడంతో బ్రేక్ వేయగా వెనుక వస్తున్న వెంకటేశ్ వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో వెంకటేశ్‌కు తీవ్ర గాయాలు కాగా స్థానికులు 108 అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

చికిత్స పొందుతున్న యువకుడు..

నర్సంపేట రూరల్ : చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందిన ఘటన నర్సంపేటలో సోమవారం చోటుచేసుకుంది. సీఐ రమణమూర్తి కథనం ప్రకారం...సూర్యాపేట జిల్లా కొత్తపల్లికి చెందిన వరికొప్పుల మల్లేశ్ (37) కూలీ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఈనెల 16న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు.

ఇద్దరికి గాయాలు

నర్సంపేట రూరల్ : ఖానాపురం మండలంలోని ధర్మరావుపేటకు చెందిన చింతల అశోక్ నడుపుతున్న ద్విచక్ర వాహనాన్ని నర్సంపేటలోని బైపాస్ రోడ్డులో గూడ్స్ ట్రాలీ ఢీకొట్టగా అశోక్‌తోపాటు అతడి కుమారుడు చరణ్ గాయాలపాలయ్యారు. ఈ ఘటన సోమవారం చోటు చేసుకుంది. క్షతగాత్రులను స్థానికులు 108లో నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి పంపించారు.

బెల్లం, పటిక స్వాధీనం

నెక్కొండ : చెన్నారావుపేట మండలంలోని అద్దబాట తండాకు చెందిన భూక్య కీమ్యా నుంచి 70 కిలోల బెల్లం, 20 కిలోల పటికను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి తెలిపారు. వాహనాల తనిఖీ సందర్భంగా బెల్లం, పటికతోపాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చెప్పారు. కీమ్యాపై కేసు నమోదు చేశారు. తనిఖీల్లో కానిస్టేబుళ్లు నాగరాజు, రంజిత్, దిలీప్ పాల్గొన్నారు.

కారు ఢీకొని కూలిన నేతాజీ విగ్రహం

సంగెం : కారు ఢీకొని నేతాజీ సుభాష్ చంద్రబోస్ విగ్రహం కూలిన ఘటన మండలంలోని కాపుల కనపర్తిలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా.. కాపుల కనపర్తికి చెందిన ఓ యువకుడి వివాహానికి వచ్చిన అతడి బంధువు ఆశాలపల్లి రోడ్డులోని నేతాజీ విగ్రహాన్ని ప్రమాదవశాత్తు ఢీకొట్టాడు. దీంతో విగ్రహం ధ్వంసం అయ్యింది. సదరు వ్యక్తి మద్యం మత్తులో విగ్రహాన్ని ఢీకొట్టినట్టు తెలుస్తోంది. పెండ్లి కుమారుడి సోదరుడు విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయిస్తామని గ్రామస్తులకు హామీ ఇవ్వడంతో వివాదం సద్దు మణిగింది.

రేషన్ డీలర్‌పై కేసు నమోదు

గీసుకొండ : మండలంలోని మచ్చాపూర్‌కు చెందిన 28వ రేషన్ షాపు డీలర్ దూలం రజనీకాంత్ అవకతవకలకు పాల్పడుతున్నట్లు నిర్ధారణ కావడంతో 6ఏ కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్ తెలిపారు. రేషన్ షాపులో సోమవారం తనిఖీలు నిర్వహించారు. రికార్డులు, స్టాక్‌ను పరిశీలించగా 7.47 క్వింటాళ్ల బియ్యం తేడా గుర్తించినట్లు తెలిపారు. సదరు రేషన్ షాపును డీలర్ వల్లుల సారంగపాణికి తాత్కాలికంగా అప్పటించినట్లు చెప్పారు.

గుట్కా ప్యాకెట్ల పట్టివేత

దుగ్గొండి : స్థానిక పోలీసులతో కలిసి టాస్క్‌ఫోర్స్ పోలీసులు మండలంలోని గిర్నిబావిలో దాడులు నిర్వహించి రూ.21,500 విలువైన గుట్కా ప్యాకెట్లను పట్టుకున్నారు. గిర్నిబావిలోని కిరాణం షాపులో సోమవారం పోలీసులు తనిఖీలు నిర్వహించగా గుట్కా ప్యాకెట్లు లభ్యమయ్యాయి. గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని బొమ్మగాని సుమన్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ బాబూలాల్ వెల్లడించారు.

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచాలి

నెక్కొండ : విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచాలని నెక్కొండ హైస్కూల్ కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ రంగారావు కోరారు. కాంప్లెక్స్ పరిధిలోని అప్పల్‌రావుపేట హైస్కూల్‌లో ఇంటర్నల్ మార్కుల పరిశీలనను సోమవారం ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు కేటాయించబడిన ఇంటర్నల్ మార్కుల పరిశీలన కొనసాగనుందని చెప్పారు.

సేవాలాల్ మార్గం అనుసరణీయం

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి

సంగెం: గిరిజనుల ఆరాధ్యమైన సంత్ సేవాలాల్ మార్గం అనుసరణీయమని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిజనులు నిర్వహించిన ర్యాలీ, ఆటపాటలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. సేవాలాల్ బంజారాల అభ్యున్నతికి దేశవ్యాప్తంగా తిరిగి వేర్వేరుగా కాకుండా ఒకే దగ్గర నివసించాలని సూచించారు. గిరిజన యువత సేవాలాల్ మార్గాన్ని ఆదర్శంగా తీసుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. సేవాలాల్ దేవాలయ నిర్మాణానికి భూమిని కేటాయిస్తామని తెలిపారు. సేవాలాల్ జయంతి వేడుకలకు నియోజకవర్గానికి రూ.3.30లక్షల నిధులు ఇచ్చినట్లు తెలిపారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సేవాలాల్ జయంతి రోజు ప్రభుత్వం ఐచ్ఛిక సెలవుదినంగా ప్రకటించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు గుగులోత్ వీరమ్మగోపిసింగ్, నాయకులు, గిరిజనులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామ పంచాయతీలకు నిధులివ్వండి



పర్వతగిరి : వినతిపత్రం ఇస్తున్న జీపీ కార్యదర్శులు

పర్వతగిరి/గీసుకొండ/దుగ్గొండి : గ్రామ పంచాయతీలకు నిధులివ్వాలని, పెండింగ్ చెక్కులను క్లియర్ చేయాలని కోరుతూ పర్వతగిరి, గీసుకొండ, దుగ్గొండి ఎంపీడీఓ, ఎంపీఓలకు పంచాయతీ కార్యదర్శులు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా పర్వతగిరిలో పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షుడు గుగులోతు యాకూబ్‌నాయక్ మాట్లాడారు. గ్రామపంచాతీలకు గతేడాది ఆగస్టు నుంచి రావాల్సిన నిధులు విడుదల చేయాలని కోరుతూ పంచాయతీ కార్యదర్శులు ఎంపీడీఓ కృష్ణవేణికి సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం పంచాయతీ కార్యదర్శులు మాట్లాడారు. గతేడాది ఫిబ్రవరిలో పంచాయతీల పాలకవర్గ కాలపరిమితి ముగియగా నాటి నుంచి పారిశుద్ధ్య నిర్వహణ, ఇతర ఖర్చులకు జారీ చేస్తున్న చెక్కులు ఐఎస్‌ఎంఎస్‌లో ఆగస్టు నుంచి పెండింగ్‌లో ఉండడంతో నిధులు రాక ఖర్చుల డబ్బులు చెల్లించలేని దుస్థితి నెలకొందని చెప్పారు. నిధులు విడుదల చేయకుంటే మార్చి 1 నుంచి పంచాయతీల నిర్వహణ సాధ్యం కాదన్నారు. కార్యక్రమాల్లో తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల సెంట్రల్ ఫోరమ్ అసోసియేట్ అధ్యక్షుడు కల్లెపు సదానందం, టీఎన్‌జీఓల సంఘం జాయింట్ సెక్రటరీ రఘు, ఈసీ మెంబర్ అశోక్, తెలంగాణ పంచాయతీ కార్యదర్శుల ఫోరమ్ జిల్లా జాయింట్ సెక్రటరీ సుమన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో కాల్వలో పనులు



ముల్కలగూడెం వద్ద పనులు చేయిస్తున్న నాయకులు

- ఐబీ అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు

సంగెం : పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చొరవతో దేవాదుల ఎత్తిపోతల కాల్వలో కాంగ్రెస్ నాయకులు మట్టి, ముళ్లపొదలు, పిచ్చిచెట్లను సోమవారం తొలగించారు. ఐబీ అధికారులు పట్టించుకోకపోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సంగెం, వర్ధన్నపేట, ఖిలా వరంగల్ మండలాల్లోని పలు గ్రామాలకు దేవాదుల ఎత్తిపోతల నీరు రాకుండా ఐనవోలు మండలానికి చెందిన కొందరు రైతులు షట్టర్లకు సిమెంట్ వేయడంతోపాటు కాల్వలో మట్టి వేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో 'అయ్యో దేవా.. గోడు ఆలకించేదెవరు?' శీర్షికతో రైతుల ఇబ్బందులపై 'సాక్షి'లో ప్రచురించిన కథనంపై ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి స్పందించారు. సమస్యను సత్వరమే పరిష్కరించాలని కాంగ్రెస్ నాయకుడు గుమ్మడి హరిబాబును ఆదేశించారు. దీంతో నాయకులు గూడ సంపత్‌రెడ్డి, లింగాల నవీన్‌రెడ్డి, దండ నరేశ్, గాలి రాజు, బొడ్డుపల్లి కార్తీక్, కూనూరు రమేశ్, తదితరులు జేసీబీతో కాల్వకు అడ్డుగా ఉన్న మట్టి, ముళ్లపొదలు, పిచ్చిచెట్లను తొలగింపజేశారు. కాగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటుండడంపై బాధ్యులైన ఐబీ అధికారులు పట్టించుకోకపోవడంపై అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతోపాటు మండల ప్రజలు, రైతులు మండిపడుతున్నారు.

దురుసు ప్రవర్తన వల్లే కేసులు

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హామ్యానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న హామ్యానాయక్

రాయపర్తి : పోలీసులతో దురుసుగా ప్రవర్తించడం వల్లే బీఆర్‌ఎస్ నాయకులపై కేసులు నమోదయ్యాయని తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మైలారంలో జరిగిన మారెమ్మ, దుర్గమ్మ ఉత్సవాల్లో బీఆర్‌ఎస్ నాయకులు పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డిపైన దాడులకు దిగుతారేమోననే ఆందోళనతో పోలీసులు అడ్డుకునేందుకు ప్రయత్నించగా దురుసుగా ప్రవర్తించారని చెప్పారు. ఎమ్మెల్యేపై తప్పుడు ప్రచారం చేయడం సరికాదన్నారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కృష్ణారెడ్డి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చిర్ర మల్లయ్య, నాయకులు భూక్య సమ్మయ్య, గుగులోతు శ్రీనివాస్, ఉల్లెంగుల యాదగిరి, మూనావత్ రవి, ఎల్లారెడ్డి, మచ్చ రమేష్, లేతాకుల రత్నాకర్‌రెడ్డి, చెవ్వ కాశీనాథం, చిర్ర శ్రీధర్, రామ, బన్నా, మోహన్, రాజు, సక్రు, చిర్ర రాములు, యాకయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నారం దర్గా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్‌పై ఫిర్యాదు

పర్వతగిరి : మండలంలోని అన్నారం షరీఫ్ యాకూబ్ బాబా దర్గా వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ రియాజ్‌పై చైర్మన్ అజ్మదుల్లా ఉల్లా హుస్సేన్‌కు గ్రామస్తులు సోమవారం ఫిర్యాదు చేశారు. అన్నారం దర్గా తలనీలాల అవకతవకలపై చైర్మన్‌కు ఆధారాలు అందజేశారు. అన్నారం దర్గాను అభివృద్ధి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు లూనావత్ భిక్షానాయక్, ఈరగని మనోహర్, గుండ సాయిలు, ఈరగాని అఖిల్, గడిపల్లి రాజబాబు, భూక్య వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టర్‌పై జిల్లా కలెక్టర్‌కు..

వర్ధన్నపేట : రోడ్డు నిర్మాణం అగ్రిమెంట్‌కు విరుద్ధంగా పనులు చేస్తూ పంటలకు నష్టం కలిగిస్తున్నాడని తెలుపుతూ కాంట్రాక్టర్‌పై మండలంలోని ఇల్లంద, ఇతర గ్రామాల రైతులు పెంచాల నర్సయ్య, శ్రీనివాస్, రాజ్‌కుమార్ తదితరులు జిల్లా కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. మండలంలోని ఇల్లంద నుంచి పర్వతగిరి వరకు 33 అడుగుల వెడల్పుతో మంజూరైన రోడ్డును కాంట్రాక్టర్ 38 అడుగుల వెడల్పుతో చేయిస్తుండడంతో తమ పంట పొలాలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాంట్రాక్టర్ తీరుపై సమగ్ర విచారణ చేపట్టి చట్టరీత్యా చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.